క్లుప్తంగా

31న కోరన్న, మంగన్నల వర్ధంతి



మాట్లాడుతున్న ఏపీ గిరిజన సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ

గుమ్మలక్ష్మీపురం: శ్రీకాకుళం రైతాంగ పోరాట ఉద్యమంలో అసువులు బాసిన కోరన్న, మంగన్నల వర్ధంతి కార్యక్రమం ఈ నెల 31వ తేదీన గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించనున్నట్లు ఏపీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మండంగి రమణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కోలక అవినాష్ తెలిపారు. ఇదే విషయమై స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో సంఘ నాయకులతో ఆదివారం సమావేశమై, కోరన్న, మంగన్నల వర్ధంతి నిర్వహణపై చర్చించారు. గిరిజనుల హక్కుల సాధన కోసం ప్రాణాలు అర్పించిన వారిని స్మరించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని, కార్యక్రమానికి పెద్దఎత్తున గిరిజనులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమావేశంలో సంఘ నాయకులు మండంగి ప్రసాద్, కె.గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేశమ్మ తల్లి వారాలు



గుచ్చిమిలో దేశమ్మతల్లి తిరువీధిలో పాల్గొన్న నిర్వాహకులు

సీతానగరం: వరిఊభాల పనులు ముగియడంతో మండలంలోని గ్రామాల్లో గ్రామ అమ్మవారు దేశమ్మతల్లికి రైతులు మొక్కులు తీసుకుంటున్నారు. ఈ మేరకు గుచ్చిమి, టి సీతారాంపురం గ్రామాల్లో గ్రామ పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించి దేశమ్మతల్లికి మొక్కులు తీర్చుకునేందుకు వారాల పండగ ఉత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గుచ్చిమిలో సర్పంచ్ ఎం. శ్రీదేవి, ఎంపీటీసీ సీహెచ్ జదీశ్వరరావు, బి శంకరరావు, మన్మథరావు, ఇతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి పూజా సామగ్రితో ఘటాలతో ఊరేగింపు నిర్వహిస్తూ గుడివరకూ పాదయాత్ర చేసి మొక్కులు తీర్చుకున్నారు.

జీజీఎంపీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి



జేసీబీతో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న నిర్వాహకులు

సీతానగరం: గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో మండలంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఏఈ పవన్‌కుమార్, నిర్వాహకుడు ఆర్.తవిటి నాయుడు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం లక్ష్మీపురంలో జరుగుతున్న సీసీ కాలువల పనులను ఏఈ పవన్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అమలు చేసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఊరూరా వెళ్లిన సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరడంవల్ల ఎమ్మెల్యే అలజంగి జోగారావు ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో తాగునీరు సరఫరా, సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం, ఇంటింటి కుళాయిలు, విద్యుద్దీకరణ పనులు చేపడుతున్నారని తెలియజేశారు.

చిరస్మరణీయుడు అబ్దుల్ కలాం

రాజాం సిటీ: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని స్నేహం అసోసియేషన్ కన్వీనర్ అంబికా కోటేశ్వరరావు అన్నారు. ఆదివా రం కలాం జయంతిని పురస్కరించుకుని కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలాం జా తి గర్వించదగ్గ నేత అని, భారతదేశ ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన మహనీయుడని కొనియాడారు. కలాంను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో స్నేహ అసోసియేషన్ సభ్యులు కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్, బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్య, యూఎస్ యా దవ్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందులు విక్రయిస్తే చర్యలు

రేగిడి: నకిలీ పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ హెచ్చరించారు. మండలంలోని బూరాడ, పనసలవలస గ్రామాల్లోని ఫెర్టిలైజర్స్ షాపులను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. రైతులను మోసగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



వీరఘట్టం: పూజలందుకుంటున్న కోటదుర్గమ్మ



వీరఘట్టం: కొండవీధిలో మత్స్యకారులు ప్రతిష్ఠించిన దుర్గాదేవి ఉత్సవ విగ్రహం



పాలకొండ రూరల్: ప్రత్యేకాలంకరణలో నీలమాంబ



పాలకొండ రూరల్: పూజలందుకున్న పురటాల పోలమాంబ



వీరఘట్టం: భవానీ భక్తులకు మాలాధరణ చేస్తున్న యజ్ఞకర్త శర్మయాజీ

తల్లీ.. చల్లంగ చూడమ్మా..!

- ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- దీక్షలు చేపట్టిన భవానీ, సంతోషిమాత భక్తులు
- రోజుకో అవతారంలో అమ్మవారి దర్శనం
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

వీరఘట్టం: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం, భక్తుల పాలిట కల్పవల్లి శ్రీకోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తల్లీ.. జగన్మాతా.. నమోఃనమామి.. మమ్మల్ని చల్లంగ చూడమ్మా.. ఆది పరాశక్తి ఆదుకోవమ్మా అంటూ భక్తులు దుర్గమ్మను కొలిచారు. స్థానిక పట్టణంలో జరిగిన కార్యక్రమంలో మహిళలు సహస్ర నామార్చనలు, నారికేళాభిషేకాలు చేసి, తమ మొక్కులు తీర్చుకున్నారు. సర్వశుభాలు కలగాలని అమ్మవారికి చీరలు, జాకెట్లు సమర్పించారు. ఈ నెల 24వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా దేవీ దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో చేసిన విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ నాలుగు దశాబ్దాలుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్న ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో 108 మంది భవానీ, సంతోషిమాత భక్తులు దీక్షలు చేపట్టారు. వీరంతా దుర్గమ్మకు కుంకుమ పూజలు చేసి, మాలాధారణ చేశారు.



గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో ప్రతిష్ఠించిన అమ్మవారి ఉత్సవ విగ్రహం

సంబరం.. ఆరంభం..

స్థానిక కొండవీధిలో మత్స్యకారుల ఆధ్వర్యంలో దసరా సంబరాలు ఆరంభమయ్యాయి. తొలుత వీధిలో దుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూ కడుతున్నారు.

రోజుకో అవతారంలో దర్శనం..

పాలకొండ రూరల్: పట్టణంలోని నాగవంశపువీధి కూడలిలో పురటాల పోలమాంబ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్దఎత్తున ఆలయానికి చేరుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు ఇక్కడి అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. నక్కలపేటలోని జ్ఞానసరస్వతి ఆలయ ఆవరణలో కూడా అష్టాదశ శక్తిపీఠాలకు పూజలు చేసి, ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముస్తాబైన ఆలయాలు, విద్యుద్దీపాలంకరణలో మెరిసిపోతున్న ఆలయ ప్రాంగణాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

సీతంపేట: స్థానిక సంతోషిమాత ఆలయ ప్రాంగణంలో పందిరిరాట వేసి, దసరా ఉత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఆలయ అర్చకులు వేమకోటి సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దోనుబాయి, మల్లి గ్రామాల్లో సైతం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో దసరా ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏఎస్ఐ గురుమూర్తి ఆధ్వర్యంలో దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించి, మండపంలో ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. బిల్లుమడ గ్రామంలోనూ మజ్జిగౌరమ్మ దేవాలయంలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి, విశేష పూజలు చేశారు.

ఖడ్గదుర్గ ఉత్సవాలు..

కురుపాం: స్థానిక కోటలో ఖడ్గదుర్గ నవరాత్రి ఉత్సవాలను మాజీ కేంద్రమంత్రి వైరిచర్ల కిశోర్‌చంద్రదేవ్ ఆదివారం ప్రారంభించారు. వేదమంత్రాల నడుమ ఆయన సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకుని, ఆచార సంప్రదాయాల ప్రకారం దుర్గమ్మకు, ఖడ్గాలకు పూజలు చేశారు.

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో దుర్గాదేవి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తులతో కలిసి, అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన మండపం వద్ద విగ్రహాన్ని ఉంచి, ప్రత్యేక పూజలు చేశారు.

సకలశుభాలు కలుగుతాయి..

శ్రీకోటదుర్గమ్మ జగన్మాత అవతారం. శరవరాత్రి ఉత్సవ రోజుల్లో అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయి. భక్తుల పాలిట కల్పవల్లిగా పేరొందిన దుర్గమ్మ దర్శనానికి ఏటా భక్తులు పెరుగుతుండడం శుభపరిణామం.

–ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ, ప్రముఖ యజ్ఞకర్త, వీరఘట్టం.



సీతంపేట: పందిరిరాట వేసి, ఉత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం



కురుపాం: కురుపాం కోటలో పూజలు చేసి, ఉత్సవాలను ప్రారంభిస్తున్న మాజీ కేంద్రమంత్రి కిశోర్‌చంద్రదేవ్ దంపతులు



భామిని: బత్తిలి గ్రామంలో దుర్గమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

జిల్లేడు కషాయం తయారీపై అవగాహన



గుమ్మలక్ష్మీపురం: జిల్లేడు కషాయం తయారీని వివరిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ కో–ఆర్డినేటర్ భూషణరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాటిశీల గ్రామంలో జిల్లేడు కషాయం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కో–ఆర్డినేటర్ కిమిడి భూషణరావు జిల్లేడు ఆకులు, గోమూత్రం, చెరువు మట్టి, నీటితో జిల్లేడు కషాయం తయారు చేసి, చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వినియోగించే జిల్లేడు ద్రావణాన్ని పొట్ట దశలో ఉన్న పత్తి, అరటి, వరి పంటల్లో పిచికారీ చేస్తే అది పంటల సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందన్నారు. అలాగే పంట ఏపుగా పెరగడంతో పాటు, చీడపీడలు, తెగుళ్ల దరిచేరవన్నారు. అనంతరం రైతులకు జిల్లేడు కషాయం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీవోఏ అనూష తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని నులకజోడు గ్రామంలో జిల్లేడు కషాయం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జిల్లేడు ఆకులు, బెల్లం, గోమూత్రం, పుట్టమన్ను, శనగపిండితో జిల్లేడు కషాయాన్ని ప్రయోగాత్మకంగా తయారు చేసి, చూపించారు. ఇలా తయారు చేసిన కషాయాన్ని మూడు రోజుల పాటు పులియబెట్టి, పంటలపై పిచికారీ చేస్తే చీడపీడలు, తెగుళ్లు సోకవన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సీఆర్‌పీలు వలరౌతు ప్రభాకర్, మోటక అంభోజీ తదితరులు పాల్గొన్నారు.



భామిని: జిల్లేడు కషాయం తయారు చేసి, చూపిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నేడు తుమరాడలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పాలకొండ రూరల్: మండలంలోని తుమరాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఆరోగ్య సమస్యలతో బాధపడేవారంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి వచ్చి, వైద్య తనిఖీలు చేయించుకోవాలన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

- ఎమ్మెల్సీ విక్రాంత్



రేగిడి: రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఆదివారం రేగిడి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి రాష్ట్రాభివృద్ధి కో సం కృషి చేస్తున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని చెప్పారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేస్తున్న పథకాలను వివరించడం చరిత్రలో ఇదే మొదటి సారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్‌మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రతిఒక్కరూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ సూచించారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మండలంలోని కొండవాడ, వత్తాడ గ్రామాల్లో డ్వాక్రా గ్రూపు మహిళలకు చేతుల పరిశుభ్రత–దానివల్ల కలిగే ప్రయోజనాలపై వైకేపీ సిబ్బంది ఆదివారం అవగాహన కల్పించారు. చేతులు అపరిశుభ్రంగా ఉంటే వాటిమీదనే క్రిములు, బ్యాక్టీరియా, వైరస్‌లు ఉంటాయని, మనం తినే ఆహారం ద్వారా అవి మన శరీరంలోకి ప్రవేశించి, తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రతిఒక్కరూ భోజనం చేసే ముందు తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. ఇలా చేస్తే 80 శాతం వ్యాధులు వ్యాపించకుండా ఉంటాయన్నారు. ఆయన వెంట సీసీ పి.నాగేశ్వరరావు ఉన్నారు.



వత్తాడలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

పర్యాటకుల సందడి

సీతంపేట: అడ్వంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో పాటు విద్యార్థులకు కూడా దసరా సెలవులు ఇవ్వడంతో పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి మన్యం అందాలను చూసేందుకు పెద్దసంఖ్యలో సీతంపేట చేరుకున్నారు. చాలామంది ఇక్కడి జలవిహార్‌లో బోటుషికారు, స్కై సైక్లింగ్ చేసేందుకు ఆసక్తి కనబరిచారు. మరికొంతమంది బంజీట్రంపోలిన్, హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి ఆనందించారు.



స్కై సైక్లింగ్ చేస్తున్న యువతి



జలవిహార్‌లో బోటుషికారు చేస్తున్న పర్యాటకులు

మేమంతా వైఎస్సార్ సీపీలోనే..

సీతంపేట: మేమంతా వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతున్నామని, తామంతా టీడీపీలో చేరిపోయినట్లు వస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని మండలంలోని కిరప పంచాయతీ, పెద్దగూడ వాసులు స్పష్టం చేశారు. గ్రామానికి చెందిన మొత్తం 47 కుటుంబాల వారు టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని, అయితే అందులో వాస్తవం లేదని సవర మహేష్, బాలయ్య తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా సేవలందిస్తున్న సీఎం జగనన్న, ఎమ్మెల్యే కళావతి వెంటే ఉంటామన్నారు. ఎమ్మెల్యే చొరవతో గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు కూడా సక్రమంగా అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో గెలిపిస్తామని, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తామని, ఎమ్మెల్యే కళావతిని కూడా మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తామన్నారు.



వైఎస్సార్ సీపీ కండువాలతో పెద్దగూడ గ్రామస్తులు

నిత్యవసర సరుకుల వితరణ



వితరణకు సిద్ధం చేసిన నిత్యవసర సరుకుల బ్యాగులతో దాతలు

పాలకొండ రూరల్: స్థానిక సత్యసాయి మందిరంలో పాలకొండ పట్టణంలోని తమ్మినాయుడు విద్యాసంస్థల ఉపాధ్యాయ సిబ్బంది పేదలకు నిత్యవసర సరుకులు ఆదివారం వితరణ చేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యుడు ఆర్.కిశోర్ నేతృత్వంలో దాతలు వాటిని పేదలకు అందజేశారు. ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని, ఆపదలో ఉన్న వారికి మనవంతు సాయం చేయాలని దాతలు తెలిపారు. భగవాన్ సత్యసాయి చూపిన శాంతి, ప్రేమ మార్గాలను ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు.